
సాక్షి బాపట్ల

శనివారం । 27 । మే । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 520.60 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.



బెజవాడలో భారీ వర్షం

బెజవాడలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ మధ్యాహ్నానికి ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా వాన పడింది.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్టధర రూ.వెయ్యి, గరిష్టధర రూ.రెండు వేలు, మోడల్ ధర రూ.1,600 వరకు పలికింది.

న్యూస్‌రీల్



జయ'జన'ధ్వానాలు



పసిబిడ్డతో పట్టా కోసం..

పట్టాల సవ్వడితో చెంతనే ఉన్న కృష్ణమ్మ పులకించిందో ఏమో.. ప్రజా రాజధాని జన ప్రవాహంతో పరవళ్లు తొక్కింది. పేదల పట్టాభిషేకం చూసి వెంకటపాలెంలో కొలువైన కలియుగ ప్రత్యక్ష దైవం ఏడుకొండలు వాడే పరవశించాడో ఏమో.. అమరావతి శుక్రవారం పేదింట మహాలక్ష్ముల సందడితో సంబరమై మురిసింది. ఆడపడుచుల కరతాళ ధ్వనులతో మంగళాద్రి లక్ష్మీనరసింహుడూ స్వరం కలిపి గర్జించాడో ఏమో.. బహుజన ఢంకా జయజయధ్వానాలు చేసింది. నలుదిక్కులూ ఏకమై కదిలివచ్చాయో ఏమో.. జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శాసన రాజధాని జయహో.. జయహో అంటూ జేజేలు పలికింది.



'పట్టా'భిషేకం : ఆడపడుచుకు పట్టా అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రంలో మంత్రులు వనిత, విడదల రజని, సురేష్ ఎమ్మెల్యే ఆర్కే తదితరులు

జయహోం

- జగన్నినాదంతో మార్మోగిన శాసన రాజధాని
- అట్టహాసంగా పట్టాల పండగ
- ఇది కదా నిజమైన పసుపు కుంకుమ
- అమరావతిలో ఆడపడుచుల ఆనందోత్సాహాలు
- జూలై 8న ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

సాక్షి ప్రతినిధి, గుంటూరు, తాడికొండ: తుళ్లూరు మండలం వెంకటపాలెంలో శుక్రవారం నిర్వహించిన పట్టాల పంపిణీ కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఎదురుగా ఏర్పాటు చేసిన బహిరంగ సభా ప్రాంగణం ఆడపడుచులతో కళకళలాడింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు హాజరైన కార్యకర్తలు, నాయకులు, అక్కచెల్లెళ్లకు అభివాదం చేశారు. రూ.పది లక్షల విలువైన ఆస్తిని అన్న తరఫు లాంఛనంగా అట్టహాసంగా అందించారు. ఇది కదా పసుపుకుంకుమ అంటూ ఆడపడుచులు సంబరమై మురిసిపోయారు.



పేదింటి వరాల రేడు : లేఅవుట్ల గురించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యే ఆర్కే

పట్టాల మహోత్సవం సాగిందిలా..

10:10 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్న సీఎంకు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పేదలకు పంపిణీ చేసే లేఅవుట్‌ల గ్యాలరీని తిలకించిన ముఖ్యమంత్రి లబ్ధిదారులైన మహిళలతో కాసేపు ముచ్చటించారు. వారితో ఫొటో దిగారు. 10:29 గంటలకు వేదికపైకి చేరుకున్న ఆయన ప్రజలకు అభివాదం చేసిన అనంతరం ప్రజాప్రతినిధులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుంటూరు కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి స్వాగతోపన్యాసం చేశారు. 10:41 గంటలకు మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే ప్రసంగించారు. 10:48 గంటలకు మంత్రి ఆదిమూలపు సురేష్, 10:56 గంటలకు మంత్రి మేరుగ నాగార్జున, 11:01 గంటలకు మంత్రి జోగి రమేష్ ప్రసంగించారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగించారు. సీఎం గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి ఉన్న తేడాలు, పేదలకు జరిగిన లబ్ధిని వివరిస్తున్న సమయంలో హర్షధ్వానాలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది. జూలై 8న మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి రోజున రాజధానిలో ఇచ్చిన ప్లాట్లలో అన్ని సౌకర్యాలతో లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని ప్రజల కరతాళధ్వనుల మధ్య ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సగర్వంగా ప్రకటించారు. 12:04 గంటలకు ముఖ్యమంత్రి 50,793 మంది ఆడపడుచులకు ఇళ్లస్థల పట్టాల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. వీటితో పాటు రూ.443.71 కోట్లతో నిర్మించిన 5,024 టిడ్కో ఇళ్లను కూడా లబ్ధిదారులకు సీఎం అందజేశారు. 1,400 ఎకరాల్లో వేసిన 25 లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణంతోపాటు అన్ని వసతులూ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రతిలేఅవుట్‌లో అంగన్‌వాడీ కేంద్రం, ప్రైమరీ స్కూల్, విలేజ్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీ, పార్కులు ఏర్పాటు చేస్తామని, నవులూరులోని చెరువునూ అభివృద్ధి చేస్తామని ప్రకటించారు.

నేడు నవులూరు, కృష్ణాయపాలెంలో పట్టాల పంపిణీ

శనివారం ఉదయం నవులూరు గ్రామంలోని 500 మంది లబ్ధిదారులకు పట్టాల పంపిణీ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో మంగళగిరి ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. సాయంత్రం కృష్ణాయపాలెంలో కృష్ణాయపాలెం, పెనుమాక లబ్ధిదారులకు పట్టాల పంపిణీ జరగనున్నట్లు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు.

కిక్కిరిసిన సభా ప్రాంగణం

పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఎండను సైతం లెక్కచేయకుండా లబ్ధిదారులతోపాటు ప్రజలు భారీగా తరలిరావడంతో సభాప్రాంగణంతోపాటు పరిసరాలు జనంతో కిక్కిరిసిపోయాయి. అధికారులు ప్రజలకు తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు, స్నాక్స్ అందజేశారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.



పట్టాల మహోత్సవానికి సకుటుంబ సమేతంగా..

పాల్గొన్న ప్రజాప్రతినిధులు

కార్యక్రమంలో మంత్రులు ఆదిమూలపు సురేష్, విడదల రజని, మేరుగ నాగార్జున, అంబటి రాంబాబు, కారుమూరి నాగేశ్వరరావు, తానేటి వనిత, ఎంపీలు నందిగం సురేష్, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, కల్పలతరెడ్డి, రుహుల్లా, ఎమ్మెల్యేలు ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), కిలారి రోశయ్య, అన్నాబత్తుని శివకుమార్, నంబూరు శంకరరావు, మహ్మద్ ముస్తాఫా, వెల్లంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, మొండితోక జగన్మోహనరావు, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు, పార్టీ నాయకులు డొక్కా మాణిక్యవరప్రసాద్, కత్తెర సురేష్‌కుమార్, దేవినేని అవినాష్, గంజి చిరంజీవి, షేక్ సజిలా డీసీసీబీ చైర్మన్ లాలుపురం రాము, కలెక్టర్లు ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఢిల్లీరావు, సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్‌యాదవ్, ప్రిన్సిపల్ సెక్రటరీలు శ్రీలక్ష్మి, అజయ్‌జైన్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటా



నా జీవితంలో ఇళ్ల స్థలం, అందులో సొంతింటి నిర్మాణం కలగానే మిగిలిపోతుందేమో అనుకునేదాన్ని. కానీ ఆ కలను జగనన్న నిజం చేశారు. ఎప్పుడో ఇంటి స్థలం మంజూరైంది. చంద్రబాబు కోర్టుల్లో కేసు వేయడంతో బాధగా ఉండేది. కోర్టు అడ్డంకులన్నీ తొలగించి జగనన్న మాకు ఇంటి స్థలం ఇచ్చారు. ఆయనకు రుణపడి ఉంటాం.

– ముక్కంటి శ్రీ దుర్గ, విజయవాడ

ఇంటి స్థలం వస్తుందని అనుకోలేదు



ఇంటి స్థలం అంటే ఏదో మారుమూల ప్రాంతంలో ఇస్తారేమో అనుకున్నాను. రాజధాని ప్రాంతమైన ఇంత మంచి ఏరియాలో నాకు ఇంటి స్థలం మంజూరవుతుందని ఊహించలేదు. నా లాంటి పేదలకూ ఈ ప్రాంతంలో చోటు కల్పించిన జగనన్న మరో 50 ఏళ్ళు ముఖ్యమంత్రిగా ఉండాలి.

– పరిమళ దుర్గ, మంగళగిరి

కల నెరవేరింది



ఇంటి స్థలం, సొంతింటి నిర్మాణం కల ఇన్నాళ్లకు సాకారం కాబోతోంది. మా ఆర్థిక స్థోమత అంతంత మాత్రమే. జగనన్న అధికారంలోకి వచ్చిన వెంటనే మమ్మల్ని గుర్తించి ఇళ్లస్థల పట్టాలివ్వడం ఆనందంగా ఉంది. ఆయన రుణం తీర్చుకోలేం.

– జంగం సాంబ్రాజ్యం, మంగళగిరి

జగనన్న మా దైవం



ఓ వైపు పెరుగుతున్న అద్దెలు చెల్లించలేక, మరో వైపు ఆర్థిక ఇబ్బందులతో ఇంటి స్థలం కొనలేక నానా అవస్థలు పడ్డాం. ఇదిగో మాకు జగనన్న రూపంలో ఇలా ఇంటి స్థలం మంజూరైంది. ఆయనే మా దైవం. త్వరలో ఇల్లు నిర్మించుకుని హాయిగా జీవిస్తాం.

– కొణిదెల భాగ్యలక్ష్మి, తాడేపల్లి

జగనన్న మేలు మరువలేం



గతంలో ఇంటి స్థలం లేక, కొనుక్కునే ఆర్థిక స్థోమత లేక అత్తమామయ్యలు, ముగ్గురు కుమారులు మొత్తం 4 కుటుంబాలు ఒకే చోట ఉండాల్సిన పరిస్థితి ఉండేది. జగనన్న నాకు, మా తోడికోడలుకు ఇంటి స్థలం మంజూరు చేశారు. త్వరలో అందులో సొంతింటిని నిర్మించుకుంటాం. చాలా ఆనందంగా ఉంది. జగనన్న మేలు మరువలేం.

– పఠాన్ అస్మిత, మంగళగిరి

ఇది గొప్ప సంకల్పం

కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్రంలో సొంత ఇల్లు లేని పేదలు ఉండకూడదు అన్న గొప్ప సంకల్పంతో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం చేపట్టిందని గుంటూరు కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం వెంకటపాలెంలో జరిగిన పట్టాల పంపిణీ కార్యక్రమంలో స్వాగతోపన్యాసం చేసిన ఆయన గుంటూరు జిల్లాలో ఇప్పటికే లక్షా 17,108 మందికి ఇళ్ల పట్టాలు అందచేసినట్టు వివరించారు. దీనికోసం 276 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు రూ.1,452 కోట్ల రూపాయలు వెచ్చించి 2,512 ఎకరాల ప్రైవేటు భూములను సేకరించామని వెల్లడించారు. మొత్తం 2,789 ఎకరాలలో 284 జగనన్న కాలనీలు నిర్మిస్తున్నామని, ఆ భూములు చదునుచేసి సరిహద్దురాళ్లు, గ్రావెల్ రోడ్ల కోసం 81.56 కోట్ల రూపాయలు, తాగునీరు, విద్యుత్ సరఫరా కోసం రూ. 47.57 కోట్లు కేటాయించామని పేర్కొన్నారు. మొదటి దశలో 209 కాలనీలలో 66,125 ఇళ్ల ప్రారంభమై వేగవంతంగా జరుగుతున్నాయని, జిల్లాలో 18,448 టిడ్కో ఇళ్ల నిర్మాణం దాదాపుగా పూర్తయిందని వివరించారు. మంగళగిరి, తెనాలి, పొన్నూరులో అన్ని మౌలిక వసతులతో ప్రారంభోత్సవాలు కూడా చేశామని, అమరావతిలో ఈరోజు ముఖ్యమంత్రి చేతుల మీదుగా సీఆర్డీఏ పరిధిలోని పది గ్రామాలలో 5,024 ఇళ్ల ప్రారంభోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. ఈరోజు 23,762 మంది లబ్ధిదారులకు 10 లేఅవుట్లలో 1402.58 ఎకరాల భూమిలో పట్టాలు ఇస్తున్నామని వివరించారు.

ప్రభుత్వ పింఛన్‌దారులు ఈకేవైసీ చేయించుకోవాలి

నరసరావుపేట: ఖజానా కార్యాలయ పరిధిలోని ప్రభుత్వ పింఛన్‌దారులందరూ వెంటనే ఈ–కేవైసీ చేయించుకోవాలని ఏటీవో షేక్ మౌలాలీ కోరారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ట్రెజరీ పరిధిలో 3,255 మందికి 1,000 మంది వరకు ఈ–కేవైసీ చేయించుకోలేదని, ఎక్కువ శాతం ఫ్యామిలీ పెన్షనర్లు ఉన్నారని పేర్కొన్నారు. వీరు వెంటనే నరసరావుపేట ఉప ఖజానా కార్యాలయంలో గానీ, స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్‌లో గానీ ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని వివరించారు.

మహంకాళీ అమ్మవారి గుడికి రూ.లక్ష విరాళం



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులో వేంచేసిన మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి శుక్రవారం దాతలు రూ.1,00,116 విరాళం అందజేశారు. విజయవాడ వాస్తవ్యులు చిలుకూరి క్రాంతి కిరణ్ గుహన్ దంపతులు ఆలయ అభివృద్ధి నిమిత్తం ఈ మొత్తం అందజేశారని ఆలయ కార్యనిర్వహణాధికారి వెంకటరెడ్డి తెలిపారు. అనంతరం గుహన్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని, వారికి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించామని వివరించారు.

క్రీడలకు జగనన్న ప్రోత్సాహం

- 37వ జాతీయ క్రీడల్లో ఆంధ్రా సత్తా చాటాలి
- ఖోఖో శిక్షణ శిబిరానికి రూ.41 లక్షలు
- పంగులూరులో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేస్తాం
- రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా



క్రీడా జ్యోతితో మంత్రి రోజా, చిత్రంలో కృష్ణచైతన్య, కలెక్టర్ రంజిత్‌బాషా

జే.పంగులూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రోత్సాహం ఇస్తోందని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా పేర్కొన్నారు. మండలంలోని స్థానిక పంగులూరు మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో శుక్రవారం రాత్రి 37వ జాతీయ క్రీడలకు ఎంపికైన రాష్ట్ర ఖోఖో జట్టు శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 37వ జాతీయ స్థాయి క్రీడల్లో ఆంధ్రా సత్తాచాటాలని ఆకాంక్షించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ఖోఖో శిక్షణ శిబిరం 24 రోజులపాటు ఉంటుందని వివరించారు. వివిధ క్రీడలకు సంబంధించి రాష్ట్రంలోని ఆరు ప్రాంతాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరోనా సమయంలో గుజరాత్‌లో జరిగిన 36వ జాతీయ క్రీడలకు రాష్ట్రం నుంచి 147 మంది క్రీడాకారులు వెళ్లగా 16 మందికే పతకాలు వచ్చాయని, ఈసారి సత్తాచాటాలని సూచించారు. పంగులూరులో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో జగనన్న యూత్ ఐ కాన్ అయితే, అద్దంకిలో కృష్ణచైతన్య యూత్ ఐకాన్ అని అభివర్ణించారు.

సెంటు భూమి ఆడపడుచుల సెంటిమెంట్..

నిన్నటి వరకు టీడీపీ పెద్దలు రాజధానిలో వైఎస్సార్ సీపీకి ఒకటి, రెండు సీట్లే వచ్చేదని ఎద్దేవా చేశారని, ఇప్పుడు పేదలకు ఇళ్లస్థలాల పంపిణీకి వచ్చిన స్పందన చూస్తే అమరావతి ప్రాంతంలో టీడీపీకి అసలు సీట్లు వస్తాయా అన్నట్టుందని పేర్కొన్నారు. పేదల ఇళ్ల స్థలాలను శ్మశానంతో పోల్చిన టీడీపీ నాయకులకు సిగ్గుందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో సెంటు భూమి ఆడపడుచుల సెంటిమెంట్ అన్నారు. ఇంకా ఎక్కువ మాట్లాడితే ఆ సెంటు భూమిలోనే టీడీపీ నేతలను పాతేస్తామని హెచ్చరించారు.

పంగులూరు అంటేనే ఖోఖో

అనంతరం కృష్ణచైతన్య మాట్లాడుతూ పంగులూరు అంటేనే ఖోఖో అని అన్నారు. సొంత డబ్బులు వెచ్చించి ఇప్పటికే మూడుసార్లు జాతీయ స్థాయి పోటీలు, 10 సార్లు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు నిర్వహించామని పేర్కొన్నారు. అక్టోబర్‌లో జాతీయ స్థాయి ఖోఖో పోటీలు తప్పకుండా నిర్వహిస్తామన్నారు. అనంతరం గరటయ్య మాట్లాడుతూ గ్రామం నుంచి ఎంతో మంది క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలు ఆడారని చెప్పారు. అనంతరం మంత్రి రోజాను సన్మానించారు. అనంతరం మంత్రి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి, క్రీడా జ్యోతిని వెలిగించారు. క్రీడాకారుల ఆటను కొద్దిసేపు వీక్షించారు. కార్యక్రమంలో చివరగా అంతర్జాతీయ స్థాయి ఖోఖోలో ప్రతిభ కనబరిచిన నలుగురు క్రీడాకారులను మంత్రి సత్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ రంజిత్‌బాషా, ఆర్డీఓ సరోజిని, స్టెప్ సీఈఓ పల్లవి, రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి, కాశీవిశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులపై కలెక్టర్ ఆగ్రహం



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

జే పంగులూరు: సచివాలయంలో ఎక్కువ మంది ఎందుకు సెలవు పెట్టారని కలెక్టర్ రంజిత్‌బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట పంగులూరు సచివాలయాన్ని పరిశీలించారు. సచివాలయంలో సిబ్బంది ఎక్కువ మంది సెలవుపై వెళ్లడంపై ఆరా తీశారు. కంప్యూటర్ల డేటాను పరిశీలించారు. సచివాలయం వద్ద ఎక్కువ మంది నిలబడి ఉండడంతో వాళ్లంతా ఎందుకు ఉన్నారని అడిగారు. ఆధార్ అప్‌డేట్ చేయించుకోవటం కోసం నిలబడి ఉన్నారని సిబ్బంది బదులిచ్చారు. తరువాత రైతు భరోసా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. మండల వ్యవసాయాధికారి రికార్డులను పరిశీలించారు. మీటింగ్ రిజస్టర్‌లో సంతకాలు లేకపోవడంపై ప్రశ్నించారు. ఆర్‌బీకే పరిధిలో ఎరువుల లభ్యత, సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని మండల సర్వేయర్ వినోద్‌ను పిలిచి సర్వే నివేదికపై ఆరా తీశారు. ప్రజలకు అందుతున్న సేవల గురించి వాకబు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని, ఎక్కడ తేడా వచ్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో రమణమూర్తి, ఆర్‌ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

గృహనిర్మాణాల్లో పురోగతి సాధించాలి

కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. డివిజన్, మండల స్థాయి అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్లాలో 10,892 గృహాలు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటికి 8,394 గృహాల నిర్మాణం పూర్తయిందని, మిగిలి 2,498 గృహాలు జూలై నెల చివరి నాటికి పూర్తయ్యేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. వేమూరు, అమర్తలూరు మండలాలలో పురోగతి లేకపోవడంతో హౌసింగ్ ఏఈలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. వేమూరు, చీరాల, వేటపాలెం మండలాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణంపైనా దృష్టిసారించాలని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనుల పూర్తికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ చెప్పారు. మనబడి నాడు–నేడు పనులు జూన్ 12 నాటికి పూర్తిచేయాలని సూచించారు. త్వరలో గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ ప్రకటించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఆదేశించారు. జేసీ శ్రీధర్ మాట్లాడుతూ రెవెన్యూ దస్త్రాల స్వచ్ఛీకరణ వేగవంతం చేయాలని ఆదేశించారు.

నేడు 6 జిల్లాల్లో 'నిధి ఆప్‌కే నికత్'

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు కృష్ణనగర్‌లోని ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం (మే 27న) పీఎఫ్ పరిధిలోకి వచ్చే యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లు, ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ శుక్రవారం తెలిపారు. ఈపీఎఫ్ యాక్ట్‌లో పథకాలు, సేవలపై వాటాదారులకు అవగాహన కల్పించేందుకు కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఒంగోలులో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సమావేశాలు నిర్వహిస్తామని వివరించారు. తాడేపల్లిలోని కుంచనపల్లి అరవింద ఉన్నత పాఠశాల, కృష్ణా జిల్లా పామర్రులోని సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్, ఒంగోలులో కర్నూలు రోడ్డులోని శ్రీశారదానికేతన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, జగ్గయ్యపేట జయంతిపురంలోని రామ్‌కో సిమెంట్స్, బాపట్ల జిల్లా ఇంకొల్లులోని ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్, సత్తెనపల్లిలోని ఎస్వీఆర్ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్లో ఈ సమావేశాలు జరగనున్నాయని వివరించారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా ప్రభావతి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ నీలం ప్రభావతిని కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ప్రభావతిని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ చేసిన విషయం తెలిసిందే. అయితే జూన్ 30న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో తనను సూపరింటెండెంట్‌గానే కొనసాగించాలన్న ఆమె కోరిక మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మంత్రి విడదల రజిని


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి నాగార్జున


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి సురేష్


ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆహ్వానం పలుకుతున్నఎంపీ నందిగం సురేష్


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్నకలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

పాడి రైతులకు పశుబీమా పథకం ఊరట

పశు సంవర్ధకశాఖ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కేదారేశ్వర్

భట్టిప్రోలు: పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులకు ఊరట కలిగిస్తూ నూతనంగా ప్రభుత్వం పశు బీమా పథకాన్ని ప్రవేశపెట్టినట్లు పశు సంవర్ధకశాఖ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కేదారేశ్వర్ తెలిపారు. శుక్రవారం ఆయన భట్టిప్రోలు పశు వైద్యశాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న వైఎస్సార్ పశు నష్టపరిహారం స్థానంలో ఈ పథకాన్ని కొత్తగా ప్రారంభించినట్లు తెలిపారు. ఇందులో ఒక్కో రైతు గరిష్టంగా ఐదు పశువులకు, గొర్రెలు, మేకలు అయితే 50 వరకు బీమా చేయించుకోవచ్చని చెప్పారు. ఒక్కో పశువుకు రూ.3 లక్షలు, నాటు గేదెకు రూ. 1.50 లక్షలు ఇన్స్యూరెన్స్ వర్తిస్తుందని తెలిపారు. బీపీఎల్ దిగువ ఉన్న ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 80 శాతం ప్రభుత్వం భరిస్తుందని, రైతులు 20 శాతం కడితే సరిపోతుందన్నారు. మూడేళ్ల వరకు ఈ బీమా వర్తిస్తుందన్నారు. బీపీఎల్ కుటుంబాలుకు 50 శాతం ప్రభుత్వం భరించగా మిగిలిన 50 శాతం రైతులు కట్టుకోవాలని వివరించారు. ఆయన వెంట పశు వైద్యురాలు బి.లక్ష్మీరంజిత ఉన్నారు.


భట్టిప్రోలు పశు వైద్యశాలలో రికార్డులు పరిశీలిస్తున్న పశు సంవర్ధకశాఖ డెప్యూటి డైరెక్టర్ డాక్టర్ కేదారేశ్వర్

చీరాలలో 'అహింస' సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్

కారంచేడు: సినీ దిగ్గజం, మూవీ మొఘల్, సినీ నిర్మాత దగ్గుబాటి రామానాయుడు కుటుంబం నుంచి మరో హీరో వెండితెరకు పరిచయం కాబోతున్నాడు. మూవీ మొఘల్ డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు మనుమడు, సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబు చిన్న కుమారుడు, సినీ హీరో దగ్గుబాటి రానా తమ్ముడు అయిన దగ్గుబాటి అభిరామ్ నటించిన 'అహింస' సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కు శనివారం చీరాల ఎస్ఆర్‌పీఎం హైస్కూల్ వేదిక కానుంది. శనివారం సాయంత్రం చీరాలలో జరిగే ఈ వేడుకకు సినిమా డైరెక్టర్ తేజతో పాటు, మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్, హీరోయిన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌లతో పాటు ముఖ్య అతిథిగా సినీ హీరో దగ్గుబాటి రానా హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

ఇళ్ల పట్టాల పంపిణీ చారిత్రాత్మకం

- అమరావతిలో 50,793 మందికి ఇళ్ల పట్టాలు
- ఎమ్మెల్సీ పోతుల సునీత



చీరాల: అమరావతిలో 80 శాతం మేర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50,793 మందికి ఇళ్ల స్థలాల పట్టాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించడం దేశంలోనే ఒక చారిత్రాత్మకంగా నిలిచిపోతుందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. దేశ చరిత్రలో ఎంతో మందికి ఇళ్లు లేక, సొంతింటి కల నెరవేర్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లు లేనివారికి సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. గూడు లేనివారికి గూడు కల్పించి వారికి ఒక ఆస్తి కల్పించాలని ఆయన దృఢ సంకల్పంతో ఇళ్ల స్థలాల పట్టాల కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయ చరిత్రలో ఒక మైలు రాయిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు గత ప్రభుత్వంలో అమరావతిని రాజధానిగా చెప్పి ప్రజలందరికీ భ్రమరావతిని చూపించారన్నారు. కేంద్రం అమరావతికి రూ.3500 కోట్లు ఇస్తే ఆయనేం చేశాడన్నారు. 35 వేల ఎకరాల పొలం తీసుకుని రియల్‌ఎస్టేట్‌గా మార్చారన్నారు. వారి పెత్తందారులే అక్కడ ఉండాలని చూశారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తర్వాత అమరావతిలో అందరూ ఉండాలనే సంకల్పంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దఎత్తున ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. ఇళ్ల పట్టాలతోపాటు రోడ్లు కూడా వేయనున్నారన్నారు. జులై 8న దివంగత నేత వైఎస్సార్ జయంతి రోజున ఇళ్ల నిర్మాణాన్ని సంపూర్ణంగా చేపడతారన్నారు. పేదల పక్షాన ఉండి పోరాడుతున్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. నాలుగేళ్ల కాలంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి వారికి సుపరిపాలన అందించారన్నారు. అక్కచెల్లెమ్మలను సంతోషంగా ఉంచాలనే నిర్ణయంతో వారికి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అమ్మ ఒడి, ఆసరా, చేయూత, విద్యాదీవెన, వసతి దీవెన వంటివి అందించారని చెప్పారు. రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీపై పచ్చమీడియా చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలన్నారు. 2019 ఎన్నికల మాదిరిగానే 2024 ఎన్నికల్లోనూ ప్రతిపక్షాలకు ఇదే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రాష్ట్ర ప్రజలు రానున్న ఎన్నికల్లో సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీకి మరోసారి పట్టం కట్టాలన్నారు.

గుర్తు తెలియని మృతదేహం



స్వర్ణ (కారంచేడు): మండలంలోని స్వర్ణ–రంగప్ప నాయుడువారిపాలెం గ్రామాల మధ్యన పొలాల్లో ఒక వ్యక్తి మృతదేహం అనుమానాస్పదంగా పడి ఉంది. శుక్రవారం ఉదయం అటువైపుగా వెళ్తున్న వాహనదారులు గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శ్రీనివాసరావు తన సిబ్బందితో కలసి అక్కడకు వెళ్లి మృదేహాన్ని పరిశీలించారు. వ్యక్తి శరీరంపై ఎలాంటి ఆనవాళ్లు లేవని, సుమారు 40–45 సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. మృతుడు ధరించిన నిక్కరుపై 'అమిన్ గోల్డ్ 90 సె.మీ, షిల్పా, కోల్‌కత్తా అని లేబుల్ మాత్రం ఉందన్నారు. ప్రస్తుతం వేసవి ఉష్ణోగ్రతలు విపరీతంగా నమోదు అవుతుండడం వలన వడదెబ్బకు గురై ఉంటాడేమోనని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని చీరాల ప్రభుత్వ అసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేశామన్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే తనను సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

వివాహిత హత్య

- హత్య చేసిన భర్త, మరిది, మామ
- ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం
- పోలీస్ రంగప్రవేశంతో వెలుగు లోకి వచ్చిన వాస్తవాలు
- ముగ్గురిపై కేసు నమోదు


మృతురాలు కృష్ణవేణి (ఫైల్)

బాపట్ల టౌన్: వివాహితను హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు చేసిన ప్రయత్నాలు వికటించాయి. పోలీసుల రంగప్రవేశంతో నిందితులు అరెస్ట్ అయ్యారు. వివరాల్లోకి వెళితే.. బాపట్ల మండలం, నందిరాజుతోట గ్రామానికి చెందిన జొన్న గోపయ్యకు మూడు సంవత్సరాల కిందట కర్లపాలెం మండలం, యాజలి గ్రామానికి చెందిన ఉప్పాల కృష్ణవేణి (21)తో వివాహం జరిగింది. వీరికి ఏడాది వయస్సున్న లోహిత అనే పాప ఉంది. ప్రస్తుతం కృష్ణవేణి గర్భవతిగా ఉంది.

వివాహేతర సంబంధమే కారణమా?

మృతురాలు కృష్ణవేణి భర్త జొన్న గోపయ్య హైదరాబాద్‌లోని ఎయిర్‌పోర్ట్‌లో హోటల్‌లో పని చేస్తుంటారు. ఈ నేపథ్యంలో కృష్ణవేణి నందిరాజుతోటలోని అత్తారింట్లో ఉంటోంది. అదే గ్రామానికి చెందిన వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై గతంలో రెండు, మూడు పర్యాయాలు అత్తమామలు మందలించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయాన్ని ఇటీవల మృతురాలి కుటుంబసభ్యుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా గురువారం రాత్రి మృతురాలు రహస్యంగా ఫోన్ మాట్లాడుతున్న విషయాన్ని గమనించిన ఆమె మరిది జొన్న శివబాబు ఈ విషయాన్ని భర్త గోపయ్యతో చెప్పారు. దీంతో ఆగ్రహానికి గురైన అన్నదమ్ములు గురువారం రాత్రి మృతురాలిని తీవ్రంగా కొట్టి హత్యచేశారు.

ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం

మృతురాలి భర్త, ఆమె మామ, ఆమె మరిది ఈ విషయం బయటకు పొక్కకుండా ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నంలో భాగంగా బాత్‌రూమ్‌లో ఉరి వేసుకున్నట్లు నమ్మించే ప్రయత్నం చేశారు. సంఘటన జరిగిన గంటల వ్యవధిలో గురువారం రాత్రే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్న వాస్తవాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

సంఘటనా స్థలానికి చేరుకున్న డీఎస్పీ

బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశులు శుక్రవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకొని స్థానికులతో మాట్లాడి వాస్తవాలను సేకరించారు. హత్యకు గురైన విషయం నిర్ధారణకు వచ్చిన తర్వాత మృతురాలి కుటుంబసభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ముగ్గురిపై కేసు నమోదు

కృష్ణవేణి హత్యకు కారకులైన ఆమె భర్త జొన్న గోపయ్య, మామ భిక్షాలు, మరిది శివబాబులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ కె. వెంకటప్రసాద్ తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కుమార్తెను చంపి బాత్‌రూమ్‌లో ఉరివేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని, గత కొంతకాలం నుంచి ఆమెను చిత్రహింసలకు గురి చేస్తున్నారని మృతురాలి తల్లి సుజాత ఆరోపించింది. గురువారం రాత్రి తన కళ్ల ముందే చితకబాదారని, అడ్డువెళ్లినందుకు తనను కూడా తీవ్రంగా కొట్టారంటూ వాపోయింది. తమకు న్యాయం జరిగేంత వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ శుక్రవారం సుమారు 50 మంది మహిళలతో రూరల్‌పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించారు. డీఎస్పీ హామీతో ఆందోళన విరమించారు.

వైభవంగా గుండి పార్వతి అమ్మవారి మహోత్సవాలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు హిందూ శ్మశానవాటికలో కొలువైన గుండి పార్వతి అమ్మవారి వార్షిక మహోత్సవాలలో భాగంగా శుక్రవారం భక్తులు అమ్మవారిని అధిక సంఖ్యలో దర్శించుకుని తమ భక్తిప్రపత్తులు చాటుకున్నారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవారికి ఆబాలగోపాలం పూజలు నిర్వహించారు. సాయంత్రం నుంచి అమ్మవారి సన్నిధికి ప్రభలు కట్టుకుని తీసుకువచ్చారు. అమ్మవారిని ఆరాధించే ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది. బంధువులను పిలుచుకుని అమ్మవారి సంబరాన్ని అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ప్రతి ఏటా అమ్మవారి జాతర మహోత్సవాలు క్రమం తప్పకుండా జరుగుతాయి. అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన భారీ విద్యుత్ ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉత్సవాలలో భాగంగా దేవాలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


అమ్మవారి సన్నిధిలో ఏర్పాటు చేసిన భారీ ప్రభ

గ్రానైట్ కార్మికుడి అనుమానాస్పద మృతి

సంతమాగులూరు (అద్దంకి రూరల్): గ్రానైట్ క్వారీలో పనిచేస్తున్న కార్మికుడు అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం సంతమాగులూరు మండలంలో చోటుచేసుకుంది. మృతుడి సోదరుడు బాబువలి ఫిర్యాదు మేరకు ఎస్సై శివకుమార్ కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. అసోం రాష్ట్రం బంగంగోయి జిల్లా బిద్యపురు గ్రామానికి చెందిన అబుల్‌ఆలీ (25) సంతమాగులూరు మండలంలోని పుట్టావారిపాలెం జంక్షన్ వద్దనున్న ఏ–1 గ్రానైట్ ఫ్యాక్టరీలో ఆరు నెలలనుంచి స్టోన్ కటింగ్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి అబుల్ ఆలీ గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడుతున్నట్లు సోదరుడికి చెప్పటంతో తగ్గేందుకు ఈనో ప్యాకెట్లు తెచ్చి ఇచ్చాడు. అక్కడే నివాసం ఉంటున్న భవనం మొదటి అంతస్తులో పడుకోబెట్టి వెళ్లిపోయాడు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు స్నేహితుడు బాత్‌రూమ్‌కు వెళ్లి చూడగా అబుల్ ఆలీ రక్తపు గాయాలతో బాత్‌రూమ్‌లో నిల్చొని ఉన్నాడు. వెంటనే నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ ఉదయం 5.30 గంటలకు చనిపోయాడు. మృతుడు మెట్లపై నుంచి దిగితున్నప్పుడు ప్రమాదవశాత్తు పడి మోహానికి గాయాలయ్యాయా లేదా మరేదైనా కారణం కావచ్చని మృతుడి సోదరుడు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శివకుమార్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఐదుగురికి గాయాలు

అచ్చంపేట: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా, మరో ఐదుగురికి తీవ్రగాయాలైన ఘటన మండలంలో కొత్తపల్లి మలుపులో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే.. అమరావతి మండలం బలుసుపాడు గ్రామానికి చెందిన 20మంది రెండు ట్రక్కులపై మాదిపాడు పంచాయతీ పరిధిలోని సత్తెమ్మతల్లి వద్ద పూజలు నిర్వహించి తిరిగి వేగంగా వస్తుండగా కొత్తపల్లి మలుపులో ముందువస్తున్న ట్రక్కు అదుపు తప్పి రోడ్డు పక్కన పల్టీకొట్టింది. అందులో ప్రయాణిస్తున్న చెన్నం హనుమంతరావు (45) తలకు బలమైన గాయంకాగా మెరుగైన వైద్యంకోసం సత్తెనపల్లి ప్రభుత్వం వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. అదే గ్రామానికి చెందిన మార్నెళ్ల సాంబశివరావు, రాచగొండ రోశయ్య, తాళ్లూరి పెదరాఘవయ్య, చెన్న ప్రసాదు, డ్రైవరు తిరుమలరెడ్డి సతీష్‌లకు గాయాలయ్యాయి. స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం వారిని కూడా సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అచ్చంపేట ఎస్ఐ కె.పాల్ రవీంద్ర కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


బోల్తా పడిన మినీ ట్రక్కు

నేడు టెన్త్ ప్రతిభావంతులకు పురస్కారాలు

గుంటూరుఎడ్యుకేషన్: బాపట్ల, వినుకొండ, చీరాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభావంతులుగా నిలిచిన విద్యార్థులకు శనివారం ప్రతిభా పురస్కారాలు బహూకరిస్తున్నట్లు మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి స్టేట్, ఐసీఎస్ఈ సిలబస్‌లో 550కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు సీబీఎస్ఈ సిలబస్‌లో 450కి పైగా మార్కులను సాధించిన విద్యార్థులను సత్కరించి, వారికి నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. శనివారం సాయంత్రం 5.00 గంటలకు ఆయా పట్టణాల్లో జరిగే ప్రతిభా పురస్కార ప్రదాన కార్యక్రమాలకు హాజరు కాగోరు విద్యార్థులు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకుని, తమ తల్లిదండ్రులతోపాటు హాజరు కావాలని సూచించారు. విద్యార్థులు ఆధార్ కార్డు, టెన్త్ మార్కుల జాబితా ఇంటర్నెట్ కాపీ తీసుకుని రావాలని సూచించారు. బాపట్ల పట్టణానికి చెందిన విద్యార్థులు జీబీసీరోడ్డులోని పోలేరమ్మగుడి వద్ద ఉన్న అశోకా కన్వెన్షన్ హాల్(9100069428, 91212 10582), చీరాల పట్టణ పరిధిలోని విద్యార్థులు పేరాల ఆంధ్రా బ్యాంక్ రోడ్డులోని గోలి సదాశివరావు పద్మశాలీయ కల్యాణ మండపంలో (9248722218, 63032 93445) జరిగే కార్యక్రమాలకు హాజరుకావాలని కోరారు.

29 నుంచి పాలీసెట్ కౌన్సెలింగ్

కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు

నరసరావుపేటఈస్ట్: పల్నాడు రోడ్డులోని జేఎన్‌టీయూ–ఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 29వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు ఏపీ పాలీసెట్–2023 కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్, కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌లో భాగంగా తొలిరోజు ఒకటో ర్యాంక్ నుంచి 12,000 ర్యాంక్, రెండో రోజు 12,001 నుంచి 27,000 ర్యాంక్, మూడో రోజు 27,001 నుంచి 43,000 ర్యాంక్, నాల్గవ రోజు 43,001 నుంచి 59,000 ర్యాంక్, ఐదో రోజు 59,001 నుంచి 75,000 ర్యాంక్, ఆరో రోజు 75,001 నుంచి 92,000 ర్యాంక్, ఏడో రోజు 92001 నుంచి 1,08,000 ర్యాంక్, ఎనిమిదో రోజు 1,08,001 నుంచి చివరి ర్యాంక్ వరకు కౌన్సెలింగ్ జరుగుతుందని వివరించారు. పాలీసెట్‌లో ర్యాంక్‌లు సాధించిన ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ విద్యార్థులు రూ.250 ఆన్‌లైన్ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్లు జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు. తమ వెంట పాలీసెట్ ర్యాంక్ కార్డ్, పాలీసెట్ హాల్‌టికెట్, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, పదో తరగతి టీసీ, మార్కుల మెమో, కుల ధ్రువీకరణ పత్రం, 2020 జనవరి ఒకటో తేదీ నుంచి జారీ చేసిన ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డ్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

రైతులకు నోటీసులు అందజేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

శావల్యాపురం: రీసర్వే పనులు పూర్తయిన గ్రామాల్లోని రైతులకు నూరు శాతం ఫామ్ 9(2) నోటీసులు అందేలా క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు బాధ్యత వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. జాయింట్ కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో 106 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే పనులు పూర్తి కాగా అందులో 78 గ్రామాల్లో రికార్డు పనులు జరుగుతున్నాయన్నారు. 52 రెవెన్యూ గ్రామాల్లోని 36వేల రైతులకు భూహక్కు పత్రాలు అందజేశామన్నారు. జిల్లాలో శావల్యాపురం, ఈపూరు మండలాల్లో రీసర్వే పనుల పురోగతిపై తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో రెవెన్యూ అధికారులు గ్రామ సభలు నిర్వహించి రైతుల సందేహాలను నివృత్తి చేయాలన్నారు. రైతులు ఫామ్ 9(2) నోటీసులు తప్పనిసరిగా తీసుకోవాలని ఏమైనా అభ్యంతరాలు ఉంటే రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని పొట్లూరు, వేల్పూరు రెవెన్యూ గ్రామాల్లో కొందరు రైతులు నోటీసులు తీసుకోవటానికి రైతులు సహకరించటం లేదని రెవెన్యూ అధికారులు జాయింట్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అలాంటి రైతులను నేరుగా కలిసి వారి సమస్యను ఆరా తీయాలని లేకుంటే ప్రభుత్వ భూములుగా నమోదు చేయాలన్నారు. ఓఆర్ఐ ఛాయాచిత్రాలు గతంలో 106 రాగా నూతనంగా 161 ఛాయాచిత్రాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వెబ్ ల్యాండ్–2లో భాగంగా ఇకనుంచి గ్రామ సచివాలయాల్లో భూములు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. జిల్లాలో చుక్కల భూములు సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపటంతో 30 వేల 137 ఎకరాల్లో 9250 మంది రైతులకు రూ.1150 కోట్లు లబ్ధి చేకూరినట్లు చెప్పారు. ఆయనతోపాటు డివిజన్ రీసర్వే ఆఫ్ అధికారి ఉంగారాల వెంకటభాస్కర్, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, సర్వే అధికారి పి.నాసరయ్య, మండల డిప్యూటీ సర్వేయర్ తుంగా శ్రీనివాసరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.